


రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సికింద్రాబాద్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 5 జనవరి 2025 | HYDERABAD

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి సంబురాలు చేసుకుంటున్న నాయకులు

# డబుల్ డెక్కర్ కష్టమే!

## ప్యారడైజ్ - మేడ్చల్ మార్గంలో కష్టతరంగా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం

### హెచ్ఎండీఏ డిజైన్లలోనూ కనిపించని అవకాశాలు

### ప్రధాన అడ్డంకిగా మారిన ఇరుకైన మార్గాలు, బేగంపేట్ ఎయిర్ పోర్టు

### సాధ్యసాధ్యాలపై హెచ్ఎండీఏ, మెట్రో మల్లగుల్లాలు

సిటీబ్యూరో, జనవరి 4(నమస్తే తెలంగాణ): ప్యారడైజ్ – మేడ్చల్ మార్గంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం క్లిష్టంగా మారింది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించనుండగా, ఇప్పటికే శంకుస్థాపన, భూసేకరణ పనులను చేపట్టింది. అయితే, తాజాగా రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల మార్గంలోనే రెండు మెట్రో లైన్ నిర్మించడానికి హైదరాబాద్ మెట్రో సంస్థ నిర్ణయించగా, ఇందుకు ప్రభుత్వం కూడా డీపీఆర్ తయారీకి ఆమోదం తెలిపింది. కాగా, ప్రభుత్వం ప్యారడైజ్ నుంచి డైరీ ఫాం మార్గాన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు నిర్మిస్తున్న క్రమంలో... కొత్తగా మెట్రో రైల్ తెర మీదకు రావడం, దీంతో ఎలివేటెడ్ కారిడార్‌లోనే మెట్రో నిర్మాణం సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అయితే, హెచ్ఎండీఏ రూపొందించిన డిజైన్ల ప్రకారం, ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం అసాధ్యమేనని చెబుతుండగా, కొత్తగా డిజైన్లు రూపొందించాల్సి ఉంటుందని తెలిసింది.

### నార్త్ సిటీ అభివృద్ధిలో 'మెట్రో' అత్యంత కీలకం

నార్త్ సిటీ అభివృద్ధిలో అత్యంత కీలకంగా మెట్రో మారింది. ఇప్పటికే రెండు మార్గాల్లో మెట్రో మార్గాలను నిర్మించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినా.., క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా ప్యారడైజ్ – సుచిత్ర మార్గంలో చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులో మెట్రో కష్టమనే అభిప్రాయం హెచ్ఎండీఏ, మెట్రో వర్గాల్లో వ్యక్తం అవుతున్నది. ఈ మార్గంలో ప్రధాన అడ్డంకిగా బేగంపేట్ ఎయిర్ పోర్టు, అదే విధంగా ఇరుగ్గా ఉండే స్థలాలేనని చెబుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ విషయంలోనే బేగంపేట్ ఎయిర్ పోర్టు పరిసరాల్లో ఎలివేటెడ్ కారిడార్‌కు వీల్లేక అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మాణానికి హెచ్ఎండీఏ డిజైన్ చేసింది. కాగా.., ఈ మార్గంలో ఉపరితల మెట్రో సాధ్యం కాదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా నేషనల్ హైవే సుచిత్ర మార్గంలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లతో ఈ మార్గంలో మెట్రో సాధ్యం కాకపోవచ్చనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.



### క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాతే నిర్ణయం

ప్రభుత్వం రెండు మార్గాల్లో మెట్రో నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ రూపొందించాలని హెచ్ఎంఆర్ఎల్‌ను ఆదేశించింది. కానీ, క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో డీపీఆర్ రూపొందించినా.., సాధ్యసాధ్యాలపై క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. ఈ మార్గంలో దాదాపు ఐదున్నర కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. కాగా, బేగంపేట్ ఎయిర్ పోర్టు సమీపంలో అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మాణానికి మాత్రమే ఇప్పటివరకు డిజైన్లు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డబుల్ డెక్కర్ ఈ మార్గంలో ఉంటుందా? లేక కేవలం ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును మాత్రమే చేపడుతారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# ప్రభుత్వంపై ఒత్తిడితోనే పట్టాలపైకి మెట్రో రైల్

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 4: శామీర్‌పేట్, మేడ్చల్ వైపు మెట్రోను విస్తరించాలని అసెంబ్లీలో సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతోనే మెట్రో రైల్ పట్టాలెక్కనుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెట్రో రైల్ విస్తరణకు కృషి చేసిన ఎమ్మెల్యేతో స్థానిక నాయకులు శనివారం కలిసి కేక్ కట్‌చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రైల్ 'ప్యారడైజ్ నుంచి మేడ్చల్' వరకు 23 కిలో మీటర్లు, 'జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట' వరకు 22 కిలో మీటర్లు రెండు వైపులా 45కిలో మీటర్లు మెట్రో రైల్‌ను విస్తరించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్ట్ కోసం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి వచ్చే వారితో పాటు నగరవాసులకు ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మెట్రో రైల్‌కు ఆమోదం తెలపడంతో పాటు ఫేస్–2 పార్ట్–బీ ప్రథమ ప్రాధాన్యతా క్రమంలో మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రహ్మత్‌ఖాన్, మహమ్మద్ గౌస్, ఆరిఫ్, శరణ్‌గిరి, సందీప్, యాదగిరి గౌడ్, సతీశ్, లోకేశ్, సాజిద్, లింగారెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరం ఒంట్లో వణకు

### రాజేంద్రనగర్ @ 9 డిగ్రీలు

సిటీబ్యూరో, జనవరి 4(నమస్తే తెలంగాణ): ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నగరం వంట్లో వణుకు పుట్టిస్తున్నాయి. కాశ్మీర్, షిమ్లా లాంటి వాతావరణ స్థితిగతులు నగరంలో తాండవం చేస్తుండటంతో చలి తీవ్రత పెరిగింది. ఈశాన్య గాలుల ప్రభావంతో గ్రేటర్ వణుకుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 కంటే తక్కువకు నమోదవడం, అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఒక పక్క చలి తీవ్రత, మరో పక్క ఎండ తీవ్రతతో నగరంలో భిన్న వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు రాజేంద్రనగర్ ప్రాంతంలో అత్యల్పంగా 9.0 డిగ్రీలు, సరాసరి నగరంలో 13.2 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 30.4 డిగ్రీలు, గాలిలో తేమ 40 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# ₹26 వేల వేతనం ఇవ్వండి

### అధికారంలోకి వచ్చి ఏడాది అయినా హామీలను అమలు చేయరా?

### శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

శంషాబాద్ రూరల్, జనవరి 4: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ డిమాండ్ చేశారు. శంషాబాద్ మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేశారు. ఇందుకు హాజరైన సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నా, వారికి తక్కువ వేతనాలు ఇస్తుండటంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. వారికి అందుతున్న తక్కువ జీతాలతో కుటుంబ పోషణకు సరిపోక అప్పులు చేస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం పెంచనిచో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా సలహాదారు నగేశ్, జయేందర్, యాదమ్మ, సుజాత, రవి, రాజులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# అమ్మను వీడలేక..

### తల్లి మృతిని తాళలేక తనయుడి ఆత్మహత్య

### లాలాపేటలో దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: తల్లి మరణాన్ని తాళలేక, మాతృమూర్తి బంధాన్ని వీడలేక ఓ తనయుడు అమ్మతోనే జీవితం అంటూ, అమ్మే తనకు సర్వస్వం అని చాటి చెబుతూ నిండు నూరేండ్ల జీవితానికి ఉరి పోశాడు. తల్లిని మించిన దైవం లేదని ఓ మహాకవి చాటిన కథనాన్ని ఈ అమ్మ కొడుకు ఆత్మహత్యకు పాల్పడి మరో మారు రుజువు చేశాడు. ఈ విషాద ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, లాలాపేటలోని వినోబానగర్ బస్తీలో ఎనిమిదేండ్లుగా లక్ష్మి(43) తన కుమారుడు అభినయ్(22)తో కలిసి అద్దె ఇంటిలో ఉంటుంది. అభినయ్ ప్రైవేట్ ఉద్యోగి. లక్ష్మి కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ క్రమంలోనే ఆమె ఆరోగ్యం దెబ్బ తిని రెండు రోజుల క్రితం ఇంట్లోనే మృతి చెందింది. తల్లి మృతిని చూసి తట్టుకోలేక అభినయ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు ఎవరు కారణం కాదంటూ లేఖ రాసి పెట్టాడు. రెండు రోజులుగా తల్లి, కుమారుడి మృతదేహాలు రెండూ గదిలోనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇంటి పరిసరాల్లో దుర్వాసన వస్తుండటంతో యజమాని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అభినయ్ (ఫైల్)

# రేషన్ దుకాణాల భర్తీ ఎప్పుడో!

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 27 రేషన్ దుకాణాల ఖాళీలు

మేడ్చల్, జనవరి4(నమస్తే తెలంగాణ): రేషన్ దుకాణాల భర్తీ ఎప్పుడంటూ రేషన్‌కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 27 రేషన్ దుకాణాలు ఖాళీలు ఏర్పడిన ఇప్పటి వరకు రేషన్ దుకాణాలను భర్తీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో ఆహార భద్రత కార్డులు 5,06,125, అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 1,76,75, అన్నపూర్ణ ఆహార భద్రత కార్డులు 99 ఉన్నాయి. 619 రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో 27 ఖాళీలు ఉన్నాయి. వివిధ ప్రాంతాలలో రేషన్ దుకాణాల ఖాళీలతో మరొక ప్రాంతంలో ఉన్న రేషన్ దుకాణాలకు బదిలీ చేసిన నేపథ్యంలో రేషన్‌కార్డుదారులకు దూర భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు 10,017,150 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తుండగా 17,675 మెట్రిక్ టన్నుల చక్కరను అందిస్తున్నారు.

### జిల్లాలో రేషన్ దుకాణాల ఖాళీలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బాచ్‌పల్లిలో–2, ఘట్‌కేసర్–1, కీసర–3, మేడ్చల్–4, బాలానగర్ సర్కిల్–2, ఉప్పల్‌లో–14 ఖాళీలున్నాయి. ప్రభుత్వం సంక్రాంతి తర్వాత రేషన్ నూతన రేషన్ కార్డులు జారీ చేస్తామన్న ప్రకటన మేరకు ఇన్ని రేషన్ దుకాణాలు ఖాళీగా ఉంటే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకరంగా మారింది.


### 1,89 లక్షల దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తామన్న హామీ ఇప్పటి వరకు అమలు కాలేదు. గతేడాది ప్రజాపాలన పేరిట వివిధ పథకాల కోసం ప్రజల నుంచి 1,89 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

# నిధులు నిలిపేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ హయాంలో పది చెరువులు సుందరీకరణ
- గుర్రపు డెక్కను కూడా తొలగించని కాంగ్రెస్ ప్రభుత్వం
- క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా చెరువులను అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్రపు డెక్కను కూడా తొలగించలేకపోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సమీపంలో రూ.1.80కోట్లతో క్రీడా ప్రాంగణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. క్రీడా ప్రాంగణానికి సంబంధించి అధికారులు తయారు చేసిన మ్యాప్‌ను ఆమె పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, బ్యాడ్మింటన్ టెన్నిస్ కోర్టు, చిల్డ్రన్ గేమ్‌కు సంబంధించిన వాటిని ఆమె అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో పది చెరువులను కోట్లాది రూపాయలతో సుందరీకరణ చేశామన్నారు. గతంలో చెరువులను అభివృద్ధి చేయడానికి కేసీఆర్, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సహకారంతో కోట్లాది రూపాయలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని ప్రభుత్వానికి రెండు సార్లు లేఖ రాశామని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అల్మాస్‌గూడలో చెరువు సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిపి వేశారన్నారు. ప్రభుత్వం నిధులు రద్దు చేయడం ద్వారా చాలా చోట్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గానికి వచ్చిన రూ. 279 కోట్లు వెనక్కి తీసుకున్నారని ఆమె గుర్తు చేశారు. ప్రతి పక్ష ఎమ్మెల్యేల మీద ఉన్న కోపంతో నిధులు ఇవ్వక పోతే ప్రజలు ఇబ్బంది పడుతారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్‌కుమార్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ చంద్ర శేఖర్, కార్పొరేటర్లు అర్కల భూపాల్ రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, బిక్షపతి చారి, హరినాథ్ రెడ్డి, నవీన్ గౌడ్, సిద్దాల లావణ్య బీరప్ప, పల్లె జంగయ్య, రజాక్, బీఆర్ఎస్ నేతలు అర్కల కామేశ్ రెడ్డి,దిండు భూపేశ్ గౌడ్, జలాల్పూర్ సునీత బాల్ రాజ్, విజయ లక్ష్మి, లలిత జగన్, నిర్మల ఉన్నారు.



మీర్‌పేటలో క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




నగరం నిత్యం రణగొణ ధ్వనులమయం. వాహన వినియోగం ప్రాణ సంకటం. అయినా.. ఎవ్వరు అందుకు వెనకాడరు. వాహనం లేనిదే.. అడుగు వేయరు. ఎంత కాలయాపన జరిగినా.. వాహనం వెంట ఉండాల్సిందే. అందుకే... నగరంలో వాహనాల మోత పాతు మార్మోగుతుంది. నగరంలో ఏ రోడ్డు చూసినా వాహనం లేకుండా ఖాళీగా ఉన్న సందర్భాలు కనిపించవు. కార్యాలయాలకు వెళ్లే సమయం, ఇండ్లకు చేరే సమయం అయితే.. ఇంకా చెప్పలేము. వాహనాలను కదలనీయకుండా రహదారులు బిజీగా గడుపుతుంటాయి. ఎక్కడ చూసినా రోడ్లు వాహనాలతో మూగిపోయి ఉంటాయి. వాహనాల కాలుష్యం సైతం అధికంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో సగటు వాహనచోదకుడు ఇటు స్తంభించిన ట్రాఫిక్, అటు కాలుష్య వాయువుల నడుమ కొట్టుమిట్టాడుతూ ఎప్పటికో.. ఏ రాత్రికో గమ్యస్థానాలకు చేరుకోవాలె! ఇక్కడ కనిపిస్తున్న వాహనాల రద్దీ దృశ్యం బంజారాహిల్స్ రోడ్డు నం.1లో జీవీకే వన్ ముందుది. ట్రాఫిక్ స్తంభనలపై అధికార యంత్రాంగం కాస్త ఆలోచించి రద్దీని సద్దుమణిగేలా చేస్తే నగర సగటు వాహనదారుడు హాయిగా స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంటాడు...!!